
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
7
బుధవారం 9 అక్టోబరు 2024

- అభాసుపాలైన ప్రక్రియ
- ఇంకా కొలువు వీడని అధికారులు
- జీవో ఇచ్చి చేతులు దులుపుకున్న ప్రభుత్వం
- పలు మున్సిపాల్టీలో సీట్లు వీడకుండా ఇష్టారాజ్యం
- విధుల్లో చేరొద్దని అధికారపార్టీ నేతల బెదిరింపులు
- రాజకీయ అండతో ఉత్తర్వులను లెక్కచేయని వైనం

బదిలీలు.. బేఖాతర్

బదిలీల ప్రక్రియ ముగిసి రెండు వారాలు అవుతుంది. అయినా ఇంకా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో కింది స్థాయి ఉద్యోగుల నుంచి కీలక అధికారుల వరకు సీట్లు వదల్లేదు. బదిలీలకు సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులను ఆయా అధికారులు, ఉద్యోగులు పట్టించుకోవడంలేదు. కోరుకున్న సీటు.. ఆశించిన ప్రాంతానికి తమను బదిలీ చేయలేదని పలువురు మొండికేస్తున్నారు. వీరికి ఆయా ప్రాంతాల్లోని ఉన్నతాధికారులు, రాజకీయ నేతలు అండతో బదిలీ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. దీంతో కూటమి ప్రభుత్వం చేపట్టిన బదిలీ ప్రక్రియ అభాసుపాలైంది. జీవోలను చిత్తు కాగితాల్లా భావిస్తూ కొందరు అధికారుల బరితెగించి వ్యవహరిస్తున్నారు. కొన్ని చోట్ల బదిలీపై వచ్చిన అధికారులను విధుల్లో చేరకుండా అధికార పార్టీ నేతలు అడ్డుకుంటున్నారు. బదిలీ అయిన వారు సీట్లు వీడకపోవడం.. మరికొన్ని దగ్గర్ల బదిలీపై వచ్చిన వారిని అడ్డుకోవడంతో పరిపాలనా ప్రక్రియ స్తంభించిపోయింది. ప్రధానంగా మున్సిపాల్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల్లో ఈ పరిస్థితి నెలకొనడంతో వివిధ సమస్యలపై వచ్చే వారికి సమాధానం చెప్పేవారు లేకుండా పోతున్నారు. జీవోతో సరిపెట్టిన ప్రభుత్వం క్షేత్రస్థాయిలో అవి అమలవుతున్నాయో లేదో పరిశీలించకపోవడంపై ప్రజల నుంచి కూడా విమర్శలు వస్తున్నాయి. పేరుకే బదిలీలని అమలు నామమాత్రంగా కూడా లేదని చెప్పవచ్చు.



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గత నెల 23వ తేదీతో బదిలీల ప్రక్రియ ముగిసింది. అయితే ఇంతవరకు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని ముఖ్యమైన శాఖల్లో కూడా చాలావరకు బదిలీలు అమలు కాలేదు. బదిలీలకు సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులను కొందరు అధికారులు లక్ష్యపెట్టడంలేదు. జీవోను అమలు చేయాల్సిన కొందరు అధికారులు అధికార పార్టీ నేతలు చెప్పినదానికల్లా తలాడిస్తూ బదిలీల ప్రక్రియను బేఖాతరు చేస్తున్నారు. కొన్ని చోట్ల బదిలీపై వచ్చిన అధికారులను విధుల్లో చేరవద్దని వారిపై స్థానంలోని అధికారులు తిరస్కరిస్తుండటం గమనార్హం. బదిలీల ప్రక్రియ ముగిసి రెండు వారాలు దాటినా ఇంకా నాలుగో వంతు మంది అధికారులు, ఉద్యోగులు వారికి కేటాయించిన స్థానాల్లో బాధ్యతలు స్వీకరించలేదని సమాచారం. బదిలీ చేసినా పలువురు ఉన్న చోటును వీడకుండా తిష్టవేసి కూర్చొన్నారు. మున్సిపల్ పరిపాలనా శాఖలో బదిలీల ప్రక్రియ అస్తవ్యస్తంగా ఉంది. రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల్లో ఇంకా చాలామంది ఉద్యోగులు, అధికారులు వారికి కేటాయించిన పోస్టుల్లో బాధ్యతలు స్వీకరించలేదు. దీనినిబట్టి బదిలీలకు సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులను ప్రభుత్వ అధికారులే అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈ పరిస్థితి తెలిసి కూడా బదిలీ ఉత్తర్వులను విడుదల చేసి ఉన్నతాధికారులు కూడా తమకెందుకులే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. గత నెల 23తో బదిలీల ప్రక్రియ పూర్తయినా వారికి కేటాయించిన పోస్టుల్లో చేరని వారిపై చర్యలు తీసుకోవాల్సిన ఉన్నతాధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలున్నాయి. దీంతో కొందరు అధికారులు రాజకీయ అండదండలతో రెచ్చిపోతున్నారు.



బదిలీ అయినా పైరవీలు..

కోరుకున్న చోట పోస్టింగ్ రాని పంచాయతీ కార్యదర్శులు కొన్ని చోట్ల విధుల్లో చేరకుండా రాజకీయ పైరవీలు చేస్తున్నారు. దీంతో చాలా పంచాయతీల్లో కార్యదర్శుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే కార్యదర్శుల గ్రేడుల్లో కూడా గందరగోళం నెలకొంది. రెవెన్యూ శాఖలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. వీఆర్వోల బదిలీలు కూడా ఇంకా పూర్తి స్థాయిలో అమలు కాలేదు. బదిలీ అయిన వీఆర్వోలు కొందరు ఇంకా రిలీవ్ కాకుండా అక్కడే తిష్ట వేసుక్కూర్చొన్నారు. బదిలీల ప్రక్రియ నిర్వహించిన ఉన్నతాధికారులు రిలీవ్ కాని వీఆర్వోలపై చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారన్న విమర్శలున్నాయి. కోరుకున్న పోస్టింగ్ కోసం వీఆర్వోలు అధికార పార్టీ నేతలతో పైరవీలు సాగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కోరుకున్న ప్రాంతం దక్కని అధికారులు డిప్యూటేషన్ల బాటలో పయనిస్తున్నారు. అధికార పార్టీ నేతల అండదండలతో సదరు అధికారులు పైరవీలు చేస్తున్నారు. డిప్యూటేషన్ ఉత్తర్వుల కోసం ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. సత్తెనపల్లి మున్సిపాల్టీ నుంచి నరసరావుపేటకు, నరసరావుపేట నుంచి సత్తెనపల్లి మున్సిపాల్టీకి డిప్యూటేషన్లపై అధికారులను మార్చేందుకు రంగం సిద్ధమైనట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే నరసరావుపేట మున్సిపాల్టీలో ఓ అధికారిని విధుల్లో చేర్చుకోలేదన్న ప్రచారం జరుగుతుంది. టిడ్కోలో కూడా బదిలీలు జరిగాయి. సదరు అధికారుల్లో కొందరు ఇంకా రిలీవ్ కాలేదు.



బదిలీల ప్రక్రియ అభాసుపాలైందనడానికి కొన్ని ఉదాహరణలు..

- మాచర్ల మున్సిపాల్టీలో కమిషనర్, ఇంజనీర్ల పోస్టులు ఇంకా ఖాళీగానే ఉన్నాయి. ఈ పోస్టులకు నియామకాలు జరిగినా సదరు అధికారులు ఇక్కడకు వచ్చేందుకు ఇష్టపడక విధుల్లో చేరకుండా దుమ్మా కొడుతున్నారని సమాచారం. ఆయా అధికారులు విధుల్లో చేరకపోయినా వారిని ప్రశ్నించే వారే లేకుండాపోయారు. ఈ పరిస్థితుల్లో ఇక్కడ పురపాలన స్తంభించి ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదు.
- గుంటూరు కార్పొరేషన్‌లో పలువురు ఇంజనీర్లను బదిలీ చేశారు. వీరిలో కొందరు ఇంకా వారి సీట్లలోనే తిష్ట వేసుకు కూర్చొన్నారు. విధుల నుంచి రిలీవ్ అయ్యేందుకు వారు ఇష్టపడటం లేదు. ఇంజనీరింగ్ విభాగంలో ఇద్దరికి ఉద్యోగోన్నతులు లభించినా వెళ్లేదిలేదని ఇక్కడే పనిచేస్తామంటూ రాజకీయ అండదండలతో వారు విధుల నుంచి రిలీవ్ కానట్లు తెలిసింది. మరో ఇద్దరు ఇంజనీర్లది కూడా ఇదే పరిస్థితి.
- నరసరావుపేట మున్సిపాల్టీ ప్రణాళికా విభాగంలో ఓ అధికారిని నియమించారు. సదరు అధికారి విధుల్లో చేరేందుకు వస్తే కమిషనర్ అంగీకరించలేదు. దీంతో ఆ అధికారి గాలిలో ఉన్నారు. కీలకమైన ప్రణాళికా విభాగంలో పోస్టులన్నీ ఖాళీగానే ఉన్నాయి. ఇంజనీరింగ్ విభాగంలో ఏఈ బదిలీ అయినా ఇంకా ఇక్కడే కొనసాగుతున్నారు. కమిషనర్ సదరు అధికారిని రిలీవ్ చేయలేదని తెలిసింది. ఇక్కడ నియమితులైన ఏఈ విధుల్లో చేరకపోవడం గమనార్హం.
- పిడుగురాళ్ల మున్సిపాల్టీలోని ఓ అధికారిని గురజాల మున్సిపాల్టీకి ఇన్‌చార్జి కమిషనర్‌గా నియమించారు. గురజాలకి ఇంకా డీఈని నియమించలేదు. నరసరావుపేట, సత్తెనపల్లి, వినుకొండ మున్సిపాల్టీలలో ముగ్గురు అధికారులను సొంత జీతం విధానంతో ఇతర మున్సిపాల్టీలకు కమిషనర్లుగా నియమించారు. ఆయా మున్సిపాల్టీలో ఆ మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని రెగ్యులర్‌గా నియమించే పరిస్థితి లేదని డిప్యూటేషన్‌పై నియమించాల్సి ఉన్నట్లు చెబుతున్నారు. ఇలా సొంత జీతం విధానంలో బదిలీపై వెళుతున్న అధికారుల స్థానంతో కొత్తవారిని నియమించే విషయంలో మున్సిపల్ పరిపాలన విభాగం పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తోంది. దీంతో కొన్ని మున్సిపాల్టీల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- తెనాలికి ఓ మున్సిపల్ ఇంజనీరును బదిలీ చేశారు. ఆయనను కూడా అక్కడి కమిషనర్ విధుల్లో చేర్చుకోలేదు.

బదిలీకి ససేమిరా

గడచిన ఐదేళ్ల పాలనలో వైసీపీతో అంటకాగిన అధికారులు, ఉద్యోగులు చాలామందికి బదిలీ ఉత్తర్వులు వచ్చినా వెళ్లడానికి ఇష్టపడటంలేదు. కూటమి నేతలను ప్రసన్నం చేసుకుని తిరిగి కొనసాగేందుకు ఎత్తుగడలు వేస్తున్నారు. బాపట్లలో వైద్య ఆరోగ్య శాఖ విభాగంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగికి పొరుగు జిల్లాకు బదిలీ కాగా ఇప్పటికీ ఆయన రిలీవ్ కాకుండా పాత పోస్టులోనే కొనసాగుతున్నారు. అదేవిధంగా డిప్యూటేషన్‌మీద బాపట్ల జిల్లా పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగిని భట్టిప్రోలు మండల పరిధిలోని జడ్పీ హైస్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా బదిలీ చేశారు. కానీ ఇప్పటికీ అదే పోస్టులో సదరు ఉద్యోగి కొనసాగుతున్నారు. పైగా అక్కడే కొనసాగడానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలో కొందరు బదిలీ ఉత్తర్వులు వచ్చినా వెళ్లడానికి ఇష్టపడక రాజకీయ పైరవీల కోసం తిరుగుతూ ఉన్నారు. ఆర్‌అండ్‌బీ విభాగంలో కూడా చాలా వరకు ఇదే రకమైన పరిస్థితి నెలకొంది.



మధ్యాహ్న భోజనం.. ప్రక్షాళన

- పథకంలో మార్పులపై విద్యాశాఖ కసరత్తు
- విద్యార్థులందరూ భోజనం చేసేలా ప్రణాళిక
- స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల సూచనలు పరిగణనలోకి

గుంటూరు(విద్య), అక్టోబరు 8: మధ్యాహ్న భోజనం.. పాఠశాలల్లో విద్యార్థులు కొందరు తప్పనిసరి పరిస్థితుల్లో తింటున్నారు. మరికొందరు వదిలేస్తున్నారు. ఇంకొందరైతే అసలు బడి భోజనం తినకుండా ఇళ్ల నుంచే తెచ్చుకుంటున్నారు. దుడ్డు బియ్యంతో అన్నం.. రుచితో పాటు ఇష్టపడిన కూరల కారణంగానే విద్యార్థులు బడి భోజనంపై అయిష్టత చూపుతున్నట్లు ఎప్పటి నుంచో ఉంది. అయితే దీనిపై అటు అధికారులు, ఇటు ప్రభుత్వం పట్టించుకోకుండా మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేస్తూ వస్తుంది. బడిలోని పిల్లలందరూ ఇష్టంగా బడిలో భోజనం చేసేలా కూటమి ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం ప్రక్షాళనకు కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంలో భారీ మార్పులు చేసేలా విద్యాశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. విద్యార్థులకు పౌష్టిక విలువలతో కూడిన నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యంగా భారీ మార్పులకు సిద్ధమైంది. గత ప్రభుత్వ హయంలో అస్తవ్యస్తమైన మధ్యాహ్నభోజన పథకాన్ని గాడిలో పెట్టేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు 4300, ఉన్నత పాఠశాలలు 345కి పైగా ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు సుమారు 6.45 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. అయితే ఇందులో దాదాపు 20 నుంచి 35 శాతం వరకు విద్యార్థులు వివిధ కారణాలతో మధ్యాహ్న భోజనం చేయడం లేదు. ఆయా కారణాలు గురించి విద్యాశాఖ నివేదిక రూపంలో గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. అయినా ఫలితం లేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం తాజాగా ఇటీవల కలెక్టర్ స్థాయిలో సమీక్ష నిర్వహించింది. పాఠశాలకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్యకు భోజనం తీసుకునే విద్యార్థుల సంఖ్యకు మధ్య ఉన్న వ్యత్యాసాలు తొలగించడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇటీవల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల నుంచి బడి భోజనం బాగుండేందుకు ప్రభుత్వం సూచనలు కోరింది. పలు కమిటీలు వివిధ సూచనలు చేయగా వాటిని పరిగణనలోకి తీసుకుని పథకంలో మార్పులకు ప్రభుత్వం సిద్ధమైంది.

పథకంలో మార్పులపై కమిటీల సూచనలు..

- మధ్యాహ్న భోజనం పథకానికి బడ్జెట్ పెంచాలి. పోర్టిఫైడ్ బియ్యం పేరుతో సరఫరా చేస్తున్న లావు బియ్యం స్థానంలో సన్న బియ్యం ఇవ్వాలి.
- రోజువారీ మెనూలో అందించే చింతపండు పులిహోర బదులు లెమన్ రైస్ ఇస్తే విద్యార్థులు ఇష్టంగా తినే అవకాశం ఉంది. పొంగలి కూడా తినడంలేదు. దీనిలోకూడా మార్పులు చేయాలి.
- ఉదయం ఇచ్చే రాగిజావలో నాణ్యత ఉండటం లేదు. దానికి ప్రత్యామ్నాయంగా రాగితో చేసిన చిక్కీలు, లడ్డూలు లేదా పాలివ్వాలి.
- మంగళగిరి, తెనాలి, తాడికొండ తదితర నియోజక వర్గాల్లో అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించే మధ్యాహ్నభోజనం సాంబరుతో కలిపి ఇస్తున్నారు. ఇలా కాకుండా వైట్‌రైస్ సాంబారు విడివిడిగా ఇవ్వాలి.
- అక్షయ పాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంపిణీ చేసే మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్లు ఇవ్వడం లేదు. ఇందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి కోడిగుడ్లు సరఫరా చేయాలి.
- ఏజెన్సీలు గుడ్డు ఉడకపెట్టి పెంకు తీసి ఇస్తున్నాయి. దానిని విద్యార్థులు ఇష్టపడటం లేదు. గుడ్లు విద్యార్థులకే ఇస్తే వారే పెంకు తీసుకుని తినేలా ఏర్పాట్లు చేయాలి.
- ప్రతి శనివారం అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే మధ్యాహ్న భోజన పథకంలో ఇచ్చే స్వీట్‌ను ప్రసాదంగా భావించి పలువురు తినడం లేదు. దీనికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి.
- ఏజెన్సీలకు ఏ నెలకానెల బిల్లులు చెల్లించడంలేదు. అప్పులు చేయాల్సి వస్తుంది. నెలనెలా బిల్లులు ఇస్తే ఏజన్సీలకు అప్పుల బాధ తప్పుతుంది.



నకరికల్లు మండలం నరసింగపాడులో రూ.3కోట్ల కరెన్సీతో ధనలక్ష్మి అలంకారంలో గంగా అన్నపూర్ణాదేవి



నరసరావుపేట: సత్తెనపల్లి రోడ్డులోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి కరెన్సీ నోట్లతో ధనలక్ష్మీ అలంకారం →

జగజ్జననికి జేజేలు

నరసరావుపేట, అక్టోబరు 8: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. ఆరో రోజున మంగళవారం అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు జరిగాయి. పలు దేవాలయాల్లో అమ్మవారిని వివిధ రూపాలలో అలంకరించారు. పెద్దఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు అందుకున్నారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తి సంగీత కచేరి, ప్రవచనాలు జరిగాయి. కార్యక్రమాలను పాలకవర్గ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

- 256 మద్యం దుకాణాలకు 2683 దరఖాస్తులు
- గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ముందుకు రాని వ్యాపారులు
- బాపట్ల జిల్లాలో 8 దుకాణాలకు ఒక్క దరఖాస్తు కూడా రాని వైనం
- పలు నియోజకవర్గాల్లో సిండికేట్.. ప్రభుత్వ ఆదాయానికి గండి

స్పందన.. అంతంతే



నియోజకవర్గం	షాపులు	దరఖాస్తులు
గుంటూరు తూర్పు, పశ్చిమ	35	529
మంగళగిరి	24	345
తాడికొండ	19	378
ప్రతిపాడు	12	159
పొన్నూరు	17	223
తెనాలి	20	78
నరసరావుపేట	17	123
చిలకలూరిపేట	17	102
వినుకొండ	19	190
సత్తెనపల్లి	19	123
గురజాల	22	219
మాచర్ల	15	101
పెదకూరపాడు	20	116

గుంటూరు (కార్పొరేషన్), నరసరావుపేట, పిడుగురాళ్ల, అక్టోబరు 8: ప్రైవేటు వ్యక్తులకు మద్యం వ్యాపారం అప్పగించే క్రమంలో దరఖాస్తుల ద్వారా ప్రభుత్వం భారీ ఆదాయం ఆశించగా అది తలకిందులైంది. ఇక ఒక్క రోజు మాత్రమే గడువు ఉన్నా మద్యం వ్యాపారుల నుంచి దరఖాస్తులు కనీస స్థాయిలో కూడా రాలేదు. గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో 256 మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ జారీ చేయగా మంగళవారం సాయంత్రానికి కేవలం 2683 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. మద్యం వ్యాపారానికి పోటీ అధికంగా ఉంటుందని.. దరఖాస్తుల ద్వారానే పెద్దమొత్తంలో ఆదాయం వస్తుందని ప్రభుత్వం ఆశించింది. అయితే తొలుత ఈ పరిస్థితి అన్ని దగ్గర్ల ఉంది. ఇందులో భాగంగానే పెద్దసంఖ్యలో ఆశావహులు ఎక్సైజ్ అధికారులను సంప్రదించి మద్యం పాలసీపై ఉన్న అనుమానాలను నివృత్తి చేసుకున్నారు. అయితే నియోజకవర్గాల వారీగా నేతల జోక్యం పెరిగిపోవడం.. తమ అనుమతి లేకుండా వ్యాపారం చేసే పరిస్థితి ఉండదనే హెచ్చరికలతో చాలామంది వెనక్కి తగ్గారు. ఎవరు కూడా తొందరపడి దరఖాస్తు చేయొద్దని.. కావాలంటే మేమే వాటా ఇప్పిస్తామంటూ నేతలు కార్యకర్తల ద్వారా ప్రచారం చేశారు. ఈ పరిస్థితుల్లో మనకెందుకు వచ్చిన బాధ ఆ నేత వద్దన్నప్పుడు... మనం ముందుకు వెళ్లడం.. దరఖాస్తు చేయడం వృథా అని పలువురు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయా జిల్లాలలో మద్యం షాపులకు దరఖాస్తు చేసేందుకు వ్యాపారులు ముందుకు రాలేదు. దరఖాస్తు ధర రూ.2 లక్షలు కావడం అది కూడా తిరిగిరాని మొత్తం కావడంతో కొన్ని దగ్గర్ల వ్యాపారులే నేతల సూచనలతో సిండికేట్‌గా మారి దరఖాస్తులు చేశారు. ఈ కారణంగా కూడా ఎక్సైజ్ అధికారులు ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాలేదని తెలుస్తోంది. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడింది. సిండికేట్ అయితే సహించమని ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసినా నియోజకవర్గాల్లో నేతలే వాటిని పట్టించుకోవడంలేదు. గుంటూరు జిల్లా పరిధిలో తాడికొండ, మంగళగిరి, గుంటూరు తూర్పు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గాల్లో మినహా మిగిలిన నియోజకవర్గాల్లో దరఖాస్తులు పెద్దగా రాలేదు. ఈ నియోజకవ్గాల్లో మద్యం వ్యాపారులు సిండికేట్‌గా మారడంతో దరఖాస్తులు ఆశించిన మేర రాలేదని సమాచారం. గుంటూరు జిల్లాలో 13.45 శాతం మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. పల్నాడు జిల్లాలోని సత్తెనపల్లి, గురజాల నియోజకవర్గాల్లో పది శాతం మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో 129 షాపులు ఉండగా 974 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి.



పిడుగురాళ్ల ఎక్సైజ్ కార్యాలయంలో మద్యం షాపులకు దరఖాస్తులు అందజేస్తున్న దరఖాస్తుదారులు

పల్నాడులో ఐటీ ఉద్యోగుల దూకుడు

పల్నాడు ప్రాంతంలో కొన్ని ప్రాంతాల్లో దరఖాస్తు చేసుకునేందుకు కొందరు ఐటీ ఉద్యోగులు ఆసక్తి చూపుతున్నారని తెలుస్తోంది. బెంగళూరు, హైదరాబాద్, చెన్నైలలో పనిచేస్తున్న కొందరు దసరా పండుగకు సొంత ఊర్లకు వచ్చారు. పనిలో పనిగా ఇదే సమయంలో మద్యం షాపులకు దరఖాస్తులు చేసేందుకు ముందుకు వస్తున్నారు. పిడుగురాళ్ల రూరల్ పరిధిలోని గుత్తికొండ, జానపాడు గ్రామాలకు చెందిన కొందరు ఐటీ ఉద్యోగులు వైన్‌షాపులకు దరఖాస్తులు అందజేస్తామంటుండగా మరికొందరు తెరవెనుక ఉండి కుటుంబ సభ్యులు, బంధువులు, మరికొందరి పేర్లతో దరఖాస్తులు పూర్తి చేస్తున్నారు.

నేటితో ముగియనున్న గడువు

మద్యం షాపుల దరఖాస్తుల ప్రక్రియ ఈ నెల 1 నుంచి ప్రారంభమైంది. బుధవారం సాయంత్రం 5 గంటల లోపు రూ2 లక్షలు డీడీ చెల్లించి, దరఖాస్తులు ఆన్‌లైన్లో అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. 5 గంటలు తర్వాత దరఖాస్తులు తీసుకోమని అధికారులు ప్రకటించారు.

బాబ్బాబు.. దరఖాస్తు చేయండి

బాపట్ల జిల్లాలో మద్యం షాపులకు దరఖాస్తుల విషయంలో నిర్దేశించిన లక్ష్యాలకు, వచ్చిన వాటికి పొంతన లేదు. మంగళవారం సాయంత్రం వరకు 1050 వరకు దరఖాస్తులు రాగా ఇంకా ఒక్కటి కూడా రాని షాపులు జిల్లాలో 8 వరకు ఉన్నాయి. జిల్లాలో 2,300 వరకు దరఖాస్తులు రావాలని ఎక్సైజ్ శాఖకు ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించినట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో సగం కూడా దరఖాస్తులు రాకపోవడంతో ఎక్సైజ్ శాఖ ఒత్తిడిని ఎదుర్కొంటోంది. తక్కువగా స్పందన ఉన్న షాపులతో పాటు జీరో దరఖాస్తుల విషయంలో పై అధికారుల నుంచి వస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పుకోలేక యంత్రాంగం తలలు పట్టుకుంటోంది. షాపుల గురించి వివరాలు అడిగి వెళ్లిన వారికి కూడా ఎక్సైజ్ సిబ్బందే ఫోన్ చేసీ మరీ దరఖాస్తు చేయడానికి ఆహ్వానిస్తున్నారంటే వారి మీద ఉన్న ఒత్తిడి ఏ స్థాయిలో అర్థం చేసుకోవచ్చు. ఎవరైనా రాజకీయంగా సిండికేట్ అవడం వల్ల దరఖాస్తులు రావడం లేదా అనే కోణంలో కూడా విచారణ జరిపి అక్కడ ఆశావహులకు భరోసా కల్పించేలా చర్యలు చేపడుతున్నారు. భట్టిప్రోలు మండల పరిధిలో ఉన్న ఐదు షాపులకు నాలుగింటికి మంగళవారం వరకు కూడా ఒక్క దరఖాస్తు కూడా పడలేదని సమాచారం. ఇక్కడ ఏమైనా రాజకీయ సిండికేట్ జరిగిందా అనే అనుమానం కూడా తలెత్తుతోంది.

దోపిడీ ముఠా అరెస్టు


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ నాగేశ్వరరావు

చిలకలూరిపేట, అక్టోబరు 8: ఆటోలలో ప్రయాణికుల్లా నటిస్తూ, వారిని మభ్యపెట్టి మూడు బిళ్లల ఆట ఆడించి, వారి నుంచి డబ్బులు, విలువైన వస్తువులు దోపిడీ చేసే ఐదుగురు సభ్యులున్న దొంగల ముఠాను రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు ఆధ్వర్యంలో మంగళవారం అరెస్టు చేశారు. నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. బాపట్ల జిల్లా మార్టూరు మండలం నాగరాజుపల్లి తండాకు చెందిన బాణావతు రాంబాబు నాయక్, తన మామ రామావత్ బాబు నాయక్‌తో కలసి చిలకలూరిపేట గొర్రెల మండిలో తన 16 పొట్టేళ్లు ఇటీవల అమ్మారు. తద్వారా వచ్చిన రూ.1,15 లక్షలను తీసుకొని స్వగ్రామానికి వెళ్లటానికి ఆటో కోసం ఎదురు చూస్తున్నారు. దోపిడీ ముఠా పథకం ప్రకారం వీరిని ఆటోలో ఎక్కించుకొని మార్గమధ్యలో బెట్టింగ్ తరహాలో మూడు బిళ్లల ఆట ఆడించారు. వారి వద్ద నుంచి రూ.17,500 లాక్కొని మంగలపాలెం డొంక వద్ద ఆటో నుంచి నెట్టేసి పరారయ్యారు. ఈ విషయంపై బాధితుడు రాంబాబు నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు జరిపారు. ఈ కేసుకు సంబంధించి నాదెండ్ల మండలం సాతులూరుకు చెందిన బండారు ఏడుకొండలు, శివరాత్రి నాగేంద్రబాబు, జెట్టిపాటి నాగరాజు, శివరాత్రి ఏడుకొండలు, జెట్టిపాటి శ్రీను అనే ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఆటోతో సహా రూ.16వేలు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై నరసరావుపేట, పిడుగురాళ్ల, అద్దంకి తదితర ప్రాంతాల్లోనూ కేసులు నమోదై ఉన్నాయని డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో ఫిర్యాదుదారుడు తన వద్ద నుంచి ముద్దాయిలు రూ.1.15 లక్షలు కాజేశారని ఫిర్యాదు చేశాడని, విచారణలో రూ.17,500 మాత్రమే దోపిడీ జరిగినట్లు తేలిందని డీఎస్పీ తెలిపారు. ఈ కేసును చాకచక్యంగా దర్యాప్తు చేసి ముఠాను పట్టుకున్న రూరల్ సీఐ బి.సుబ్బానాయుడును, సిబ్బందిని డీఎస్పీ కె .నాగేశ్వరరావు అభినందించారు.

ప్రేమోన్మాది అరెస్టు.. కోర్టులో హాజరు

చెరుకుపల్లి, అక్టోబరు 8: ప్రేమోన్మాది కుంచాల భార్గవ్ రెడ్డిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ టి.అనిల్‌కుమార్ మంగళవారం తెలిపారు. సోమవారం తెల్లవారుజామున కనగాల గ్రామంలోని మస్తాన్‌వలి, ఆయన కుమార్తె, భార్యపై కత్తితో దాడికి పాల్పడిన భార్గవ్‌రెడ్డి అతని స్నేహితుడు విజయ భాస్కర్‌రెడ్డిలను గూడవల్లి క్రాస్‌రోడ్డులో అదుపులోకి తీసుకున్నామన్నారు. మస్తాన్ వలీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మస్తాన్‌వలీ కుటుంబ సభ్యులు రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారని ఆయన తెలిపారు.

వైసీపీ ఇన్‌ఛార్జి అశోక్‌బాబుపై కేసు నమోదు

భట్టిప్రోలు (కొల్లూరు), అక్టోబరు 8: వేమూరు వైసీపీ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు, అతని అనుచరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివయ్య మంగళవారం తెలిపారు. మండల కేంద్రం భట్టిప్రోలుకు చెందిన వైసీపీ కార్యకర్త, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు షేక్ సలీమ్‌ను అశోక్‌బాబు, అతని కుమారుడు తేజ, అనుచరులు మోదుకూరి హరిబాబు, దాసరి కిరణ్‌లు తనను బెదిరింపులకు గురి చేశారని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు పొందడం ఎలా...

- నవంబరు 2021 నాటికి గ్రాడ్యుయేట్ అయి ఉండాలి
- ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లో ఉన్న వారందరూ అర్హులే
- వెరిఫికేషన్ సమయంలో ఒరిజనల్ సర్టిఫికెట్ చూపించాలి

గుంటూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాలలో 2025లో జరిగే గ్రాడ్యుయేట్ల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు పొందటానికి ఎన్నికల కమిషనర్ కొన్ని సూచనలు, ఆదేశాలను జారీ చేశారు. వాటి ప్రకారం.. 2021 నవంబర్ 1 తేదీ నాటికి డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. అట్టివారికి మాత్రమే ఓటు హక్కు కల్పిస్తారు. ఇంజనీరింగ్ అయితే బీటెక్, మెడికల్ వారైతే ఎంబీబీఎస్, జనరల్ డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ చదివిన వారు ఓటు హక్కు పొందేందుకు అర్హులు. పదో తరగతి తర్వాత డైరెక్ట్‌గా డిగ్రీ చేసిన వారు అనర్హులు. అదేవిధంగా టెన్త్ తర్వాత డిప్లమో చదివిన వారికి కూడా ఓటు హక్కు ఉండదు. కేవలం టెన్త్, ఇంటర్ తర్వాత డిగ్రీ చదివిన వారికి మాత్రమే ఓటు హక్కు కల్పిస్తారు. అంటే కనీసం 15 సంవత్సరాలు పాటు చదువుకున్న వారికి మాత్రమే ఓటు హక్కు ఉంటుంది. ఫారం 18 ద్వారా ఓటును పొందేందుకు 2024 నవంబర్ 6వ తారీకు వరకు అవకాశం ఉంది. మహిళలు వారు చదువుకున్న సర్టిఫికెట్‌లో ఉన్న పేరు ప్రకారం మాత్రమే దరఖాస్తు చేయాలి. వివాహితులు అయినా భర్త ఇంటి పేరు మీద దరఖాస్తు చేయడానికి వీలు లేదు. ఈ విషయాన్ని మహిళలంతా గమనించాలి. అప్లికేషన్ మీద రోసే అడ్రస్సు, నివాస ధ్రువీకరణ పత్రంలో ఉండాలి. అప్లికేషన్‌లో అడ్రస్ ఒకలా, ధ్రువీకరణ పత్రంలో అడ్రస్ మరోలా ఉంటే ఆ ఓటును తిరస్కరిస్తారు. రెసిడెన్స్ ప్రూఫ్ పెట్టుకోవచ్చు. 2024 నవంబర్ 6వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో లేదా ఆఫ్ లైన్‌లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటుకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అయితే సీఈఓ ఆంధ్ర.ఎన్ఐసి.ఇన్‌లో అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. గతంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసిన వారు కూడా మళ్లీ కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాల్సిందే. దరఖాస్తుదారులు డిగ్రీ ప్రొవిజినల్స్, ఓడీ, లేదా అన్ని సబ్జెక్టులు పాస్ అయినట్టుగా సర్టిఫికెట్ లేదా, సర్టిఫికెట్ పోయి ఉంటే సంబంధిత యూనివర్సిటీ నుంచి అఫిడవిట్ సమర్పించవచ్చు. దరఖాస్తుదారులు తప్పనిసరిగా కలర్ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, సెల్ ఫోన్ నంబర్, ఓటర్ కార్డు ఉంటే దానిని కూడా దరఖాస్తుతోపాటు జత చేస్తే ఆ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఓటు హక్కు పొందవచ్చు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాలలో ఉన్న అందరూ గ్రాడ్యుయేట్స్ ఓటు హక్కు పొందవచ్చు. వీరంతా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గం కిందకు వస్తారు. వెరిఫికేషన్ టీం వచ్చినప్పుడు ఓటు పొందే వ్యక్తి ఆ సమయంలో అందుబాటులో లేనప్పుడు వారి కుటుంబ సభ్యులు ఒరిజినల్ సర్టిఫికెట్ చూపించవచ్చు. జిరాక్స్ కాపీలపై స్వీయ ధ్రువీకరణతో పాటు గజిటెడ్ ఆఫీసర్ తో తప్పనిసరిగా అటెస్టేషన్ చేయించాలి. ఓటు పొందేవారు ఇంతకుముందు అసెంబ్లీ ఎన్నికలలో ఓటరుగా ఉండనవసరం లేదు. ఓటు లేకపోయినా గ్రాడ్యుయేట్స్ అయి ఉంటే ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తు చేసుకోవచ్చు.

నడింపాలెంలో మళ్లీ మొదలైన మట్టి అక్రమ తవ్వకాలు


నడింపాలెం వద్ద జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలు

ప్రత్తిపాడు, అక్టోబరు 8: మండల పరిధిలోని నడింపాలెం వద్ద మట్టి అక్రమ తవ్వకాలు మళ్లీ మొదలయ్యాయి. ఎక్కడ జాగా కనిపిస్తే అక్కడ మట్టి తవ్వకాలు ప్రారంభిస్తున్నారు. గత ప్రభుత్వంలో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు చేసిన బకాసురులు ఇప్పుడు చిన్నగా మళ్లీ తమ పనిని మొదలు పెట్టారు. కొన్ని రోజులు రాత్రి సమయంలో గుట్టుచప్పుడు కాకుండా మట్టి తవ్వకాలు చేసి తెల్లవారేసరికి ఆనవాళ్లు లేకుండా అక్కడి నుంచి ప్రొక్లెయినర్‌తోపాటు అన్నింటిని తీసుకెళ్లారు. ఏమి జరిగిందో ఏమో కాని తాజాగా రెండు రోజుల నుంచి జాతీయ రహదారి వెంట నడింపాలెం సమీపంలో వందల కొద్ది లారీలు పరుగులు పెడుతున్నాయి. అటు అధికారులు కాని, ఇటు పోలీసులు కాని ఎవరూ నోరు మెదపని పరిస్థితి. ఎవరికి వారు తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరిస్తూ మట్టి బకాసురులకు దారులు సుగుమం చేస్తున్నారు.మట్టి తవ్వకాల్లో ప్రావీణ్యం ఉన్న బకాసురుల మాయలో అధికార పార్టీ నాయకులు చిక్కుకున్నట్టు ఉన్నారు. దీంతో వారు ఏమీ మాట్లాడక పోవడంతో వీరి తవ్వకాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. స్థలాలు మార్చి మరీ తవ్వకాలు చేస్తున్నారు. జాతీయ రహదారికి కూత వేటు దూరంలో జగనన్న కాలనీకి వెళ్లే దారిలో వెడమ వైపున ఈ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. వందల కొద్ది టిప్పర్ల మట్టిని ఇక్కడి నుంచి తీసుకెళ్తున్నాయి. అసైన్డ్ భూమితోపాటు ఫారెస్ట్, పట్టా ల్యాండ్‌లలో తవ్వకాలు చేస్తున్నారు. అనేకమార్లు పట్టా ల్యాండ్‌దారులు తమ భూముల్లో అక్రమ మట్టి తవ్వకాలు చేస్తున్నారంటూ అధికారులను ఆశ్రయించారు. అదే రీతిలో ఇప్పుడు జరిగిన తవ్వకాల విషయంలో కూడా ఆ భూమి యజమానులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో అందజేశారు. దీనిపై స్థానిక రెవెన్యూ అధికారులు విచారణ చేస్తున్నారు.


మట్టి లోడ్‌తో వెళ్తున్న టిప్పర్లు

మిర్చియార్డుకు మూడు రోజుల దసరా సెలవులు

గుంటూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డు(గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ)కి ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు మూడు రోజుల పాటు దసరా సెలవులు ప్రకటించినట్లు పర్సన్ ఇన్‌ఛార్జ్ కాకుమాను శ్రీనివాసరావు, సెక్రటరీ ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఈ నెల 11వ తేదీన శుక్రవారం దుర్గాష్టమి, 12న శనివారం విజయదశమి, 13న ఆదివారం సాధారణ సెలవుదినం అని తెలియజేశారు. తిరిగి ఈ నెల 14వ తేదీ సోమవారం ఉదయం నుంచి యార్డులో లావాదేవీలు పునఃప్రారంభమౌతాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

3వ ప్రపంచ తెలుగు మహాసభల ముఖ్య సంచాలకులుగా రామచంద్రరాజు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 8: గుంటూరులో జరగనున్న 3వ ప్రపంచ తెలుగు మహాసభల ముఖ్య సంచాలకులుగా పెన్మత్స రామచంద్రరాజును నియమించినట్లు ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు డా.గజల్ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక భారతీయ విద్యా భవన్ ప్రాంగణంలో నియామక లేఖలను పి.రామచంద్రరాజుకు, సహ సమన్వయకర్త వాసిరెడ్డి విద్యాసాగర్‌లకు అందించారు. ఈ సందర్భంగా పి. రామచంద్ర రాజు మాట్లాడుతూ 2026 జనవరి 3,4,5 తేదీల్లో జరగనున్న ప్రపంచ తెలుగు మహా సభల విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. డా.కడిమిళ్ల వరప్రసాద్, రెడ్డప్ప ధవెజి, సింగం లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

గ్యాంగ్ రేప్ కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష

- రూ.66 వేల జరిమానా
- గుంటూరు 5వ అదనపు జిల్లా జడ్జి తీర్పు

గుంటూరు(లీగల్), అక్టోబరు 8: మేడికొండూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వేడుకకు హాజరై ఇంటికి తిరిగి వెళుతున్న భార్యభర్తలను అటకాయించి భర్తను తాళ్లతో కట్టివేసి భార్యపై అత్యాచారం చేసి నగలు దోచుకున్న కేసులో నిందితులైన ఆకుల లింగమయ్య, దాసరి ఓబులేసులకు 20 ఏళ్ల జైలు శిక్ష, 66 వేల జరిమానా విధిస్తూ 5వ అదనపు జిల్లా జడ్జి కె.నీలిమ మంగళవారం తీర్పు చెప్పారు. ఈ కేసులో దొంగ సొత్తు కొనుగోలు చేసిన మరో నిందితుడు సుంకన కు మూడు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం 2021 సెప్టెంబర్ 8న సత్తెనపల్లికి చెందిన భార్యాభర్తలు పాలడుగులో ఓ వేడుకకు హాజరై రాత్రి 10 గంటలకు తమ ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. వీరు మార్గమధ్యంలోకి రాగానే నంద్యాలకు చెందిన ఆకుల లింగమయ్య, కర్నూలు జిల్లా బిందుకూరుకు చెందిన దాసరి ఓబులేసు, దాసరి లింగమయ్య, దాసరి సుంకన్న వారిని అటకాయించారు. భర్తను కాళ్లు చేతులు కట్టివేసి భార్యపై అత్యాచారం చేయడమే కాక ఆమె ఒంటిపై ఉన్న నగలు, నగదు దోచుకున్నారు. ఈ సంఘటన అప్పట్లో రాష్ట్రంలో తీవ్ర సంచలనం సృష్టించింది. ఆమె వద్ద దోచుకున్న నగదును నంద్యాలకు తీసుకువెళ్లి ఇండ్ల రమణకు విక్రయించారు. ఈ సంఘటనపై మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి మేడికొండూరు సీఐ కె మారుతి కృష్ణ దర్యాప్తు జరిపి ఈ కేసులో ఐదుగురిని ముద్దాయిలుగా చూపుతూ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశాడు. ఐదుగురు ముద్దాయిల్లో దాసరి సుంకన్న పరారీలో ఉన్నాడు మరో ముద్దాయి మైనర్ కావడంతో అతనిపై కేసు జువనైల్ కోర్టులో విచారణలో ఉంది. కోర్టులో ఆకుల లింగమయ్య, దాసరి ఓబులేసు, బంగారం కొన్న ఇండ్ల రమణలపై కేసు విచారణ సాగింది. ఏపీపీ పల్లపు కృష్ణ ఈ కేసులో ప్రాసిక్యూషన్ నిర్వహించారు. నేరం రుజువు కావడంతో లింగమయ్య ఓబులేసులకు 20 సంవత్సరాల కఠిన కారాగారా శిక్ష , రూ. 66 వేలు జరిమానా, వీరు దొంగిలించిన బంగారం కొన్న ఇండ్ల రమణకు మూడేళ్ల జైలు శిక్ష, 5 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

నేడు టీడీపీలో చేరనున్న మోపిదేవి

బాపట్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రేపల్లె నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ బుధవారం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో పసుపు కండువా కప్పుకోవడానికి రంగం సిద్ధమైంది. ఆగస్టు నెల చివరిలోనే ఎంపీ పదవితో పాటు వైసీపీకి కూడా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. వెంటనే రాజ్యసభ ఛైర్మన్‌కు తన రాజీనామా లేఖను కూడా మోపిదేవి అందించారు. తాను టీడీపీలో చేరబోతున్నట్లు ఆ సమయంలోనే ఆయన వెల్లడించారు. వెంటనే పార్టీలో చేరాల్సి ఉన్నప్పటికీ విరుచుకుపడిన వరదలతోపాటు తదనంతర పరిణామాల వల్ల పార్టీలో చేరికకు కొంతమేర జాప్యం జరిగింది. ఎట్టకేలకు బుధవారం పార్టీలో చేరికకు ముహర్తం ఖరారయ్యింది. రేపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా తన అనుచరగణంతోపాటు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి తొలుత ఆయన పార్టీలో చేరాలనుకున్నారు. కానీ ప్రస్తుతానికి మోపిదేవి ఒక్కరే టీడీపీలో చేరనున్నట్లు తెలుస్తోంది

ఎన్నికలకు ముందు నుంచే అసంతృప్తితో...

రేపల్లె నియోజకవర్గం సీటు తనను కాదని ఈవూరు గణేష్‌కు కేటాయించడంతో ఎన్నికల సమయంలోనే మోపిదేవి వైసీపీ అధిష్ఠానం మీద తన అసంతృప్తిని పలు వేదికలపై బాహాటంగానే వెలిబుచ్చారు. రాజీనామా చేసే వరకు కూడా ఆయనే బాపట్ల జిల్లా వైసీపీ అధ్యక్షులుగా ఉన్నారు. ఎన్నికలకు ముందు సీట్ల కేటాయింపులో కూడా తన అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకపోవడంతో పాటు రేపల్లెలో క్యాడర్ అభిప్రాయాలకు విరుద్ధంగా వైసీపీ అధిష్ఠానం ఏకపక్ష నిర్ణయం తీసుకుందనే అభిప్రాయాన్ని ఎన్నికలకు ముందు వ్యక్తపరుస్తూ వచ్చిన మోపిదేవి ఇప్పుడు ఆపార్టీకి గుడ్‌బై చెపి సైకిలెక్కనున్నారు.

25 టన్నుల రేషన్ బియ్యం లారీ స్వాధీనం

- 3 టన్నుల బియ్యం ఆటో పట్టివేత


చేబ్రోలు పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం లారీ

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), అక్టోబరు 7: రేషన్ బియ్యం అక్రమ రవాణాపై చేబ్రోలు పోలీసులు తనిఖీలు నిర్వహించి మంగళవారం భారీ స్థాయిలో రేషన్ బియ్యాని స్వాధీనం చేసుకున్నారు. 25 టన్నుల బియ్యం రవాణా చేస్తున్న గుజరాత్ లారీని స్వాధీనం చేసుకోవటంతోపాటు 3 టన్నుల బియ్యం సరఫరా చేస్తున్న ఆటోను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గత కొద్ది రోజులుగా పొన్నూరు పరిసర ప్రాంతాలకు ఇతర మండలాల నుంచి భారీ స్థాయిలో బియ్యం రవాణా అవుతున్న సమాచారం పొన్నూరు, చేబ్రోలు పోలీసులకు ఉంది. గత కొద్ది రోజులుగా పొన్నూరు - చేబ్రోలు మండల సరిహద్దులో పోలీసులు గట్టి నిఘాను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో వట్టి చెరుకూరు మండలం చమళ్లమూడి గ్రామం నుంచి గుజరాత్ వెళ్తున్న 25 టన్నుల రేషన్ బియ్యం లారీని చేబ్రోలు పోలీసులు నారాకోడూరు వద్ద అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అయితే చుండూరు నుంచి ఈ లారీ గుజరాత్ వెళ్తున్నట్లు కూడా ప్రచారం జరుగుతుంది. అంతేకాకుండా గుంటూరు వైపు నుంచి చుండూరు వెళ్తున్న ఆటోను ఆపి సోదాలు నిర్వహించగా మూడు టన్నుల రేషన్ బియ్యం గుర్తించి చేబ్రోలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే లారీకి సంబంధించి బియ్యం రవాణాపై అనుమతి పత్రాలు చూపిస్తుండటంతో అనుమానించిన పోలీసులు లారీలోకి 25 టన్నుల బియ్యంను రేషన్ బియ్యామా కాదా అని నిర్ధారించాల్సిందిగా సివిల్ సప్లయిస్ అధికారులను కోరారు. విచారణ తర్వాత వీటిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసేందుకు పోలీసులు సిద్ధం అవుతున్నారు. కాగా గత కొద్ది రోజులుగా పొన్నూరు నియోజకవర్గంలో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆదేశాల మేరకు పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు.

కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు సాదియా



మంగళగిరి సిటీ, అక్టోబరు 8: దక్షిణాఫ్రికాలోని సన్‌సిటీలో ఈ నెల 8 నుంచి 13వ తేదీ వరకు జరగనున్న కామన్వెల్త్ ఎక్విప్డ్ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు గుంటూరు జిల్లా మంగళగిరి నుంచి అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ షేక్ సాదియా అల్‌మాస్ ఎంపికయ్యారని పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, షేక్ సందాని తెలిపారు. జూనియర్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ 57 కిలోల విభాగంలో సాదియా అల్‌మాస్ భారత జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. అంతర్జాతీయ వేదికపై సాదియా మరోమారు రాణించి పతకం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శి సకల కోటేశ్వరరావు, ఆర్ఎన్ వంశీకృష్ణ తదితరులు సాదియాకు అభినందనలు తెలియజేశారు.

13న గుంటూరులో ఇండియా పోస్ట్ రన్


జెర్సీ, పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మూర్తి, కాంతిలాల్ దండే తదితరులు

మంగళగిరి సిటీ, అక్టోబరు 8: జాతీయ తపాలా వారోత్సవాలను పురస్కరించుకుని ఏపీ సర్కిల్ తపాలా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన గుంటూరులో ఇండియా పోస్ట్ రన్-2024ను నిర్వహిస్తున్నట్టు విజయవాడ పోస్ట్ మాస్టర్ జనరల్ డీఎస్‌వీఆర్ మూర్తి చెప్పారు. ఫిట్ ఇండియా-ఫిట్ ఆంధ్రప్రదేశ్ నినాదంతో పౌరులందరిలోనూ ఆరోగ్య పరమైన జీవన విధానం అలవర్చాలన్న లక్ష్యంతో ఇండియా పోస్ట్ రన్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మంగళగిరిలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో మంగళవారం పోస్ట్ రన్‌కు సంబంధించిన జెర్సీ, పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ గుంటూరు లాడ్జి సెంటరులో వున్న ఆంధ్ర లూథరన్ కళాశాల ఆవరణ నుంచి రన్ ప్రారంభమవుతుందని, కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తారని తెలిపారు. ఆర్అండ్‌బీ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, ఇంజనీర్ ఇన్ చీఫ్ నయీముల్లా, గుంటూరు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ యలమందయ్య, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న మూడు లారీలు స్వాధీనం



నాదెండ్ల, అక్టోబరు 8: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ఇసుక లారీలను రూరల్ సీఐ సుబ్బనాయుడు ఆధ్వర్యంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రకాశం జిల్లా వైపు నుంచి వాగు ఇసుకతో టిప్పర్లు వస్తున్నాయన్న సమాచారంతో వాటిని గణపవరం గ్రామ పరిధిలో స్వాధీనం చేసుకున్నారు. ప్రకాశం జిల్లా టంగుటూరు ప్రాంతంలోని వాగు ఇసుకను తరలించి చిలకలూరిపేటలో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్టుగా సమాచారం. టిప్పర్ డ్రైవర్ల వద్ద ఇసుకకు సంబంధించి ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకపోవటంతో ఒక్కొక్క టిప్పర్ అధిక లోడు కలిగి ఉండటంతో వీటిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సీఐ సుబ్బనాయుడు మూడు ఇసుక టిప్పర్లను నరసరావుపేటలోని జిల్లా మైనింగ్ శాఖ కార్యాలయానికి అప్పగించారు. ఇసుక అందుబాటులో లేకపోవటంతో వాగు ఇసుకను తరలించి టన్ను రూ.1500 చొప్పున చిలకలూరిపేటలో విక్రయాలను కొనసాగిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దాచేపల్లి, అక్టోబరు 8: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం దాచేపల్లిలోని పోస్టాఫీసు సెంటర్‌లో జరిగింది. దాచేపల్లి ఎస్ఐ పాపారావు తెలిపిన వివరాల మేరకు.. దాచేపల్లి మండలంలోని సారంగపల్లి అగ్రహారం గ్రామానికి చెందిన లాలు(32) ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేస్తూ వేగంగా వచ్చి పోస్టాఫీసు సెంటర్‌లో డివైడర్‌ను ఢీకొట్టాడు. తీవ్ర గాయాలతో రోడ్డుపై పడిపోయాడు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతి వేగం కారణంగానే ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. దాచేపల్లి సీఐ గుత్తి వెంకట్రావు ఆధ్వర్యంలో ఎస్ఐ పాపారావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

పొన్నూరుటౌన్, అక్టోబరు7 : పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలులో 15 క్వింటాల రేషన్ బియ్యం సోమవారం రాత్రి అర్బన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అర్బన్ పోలీసుల కథనం ప్రకారం నిడుబ్రోలులోని ఓ గృహంలో రేషన్ బియ్యం నిల్వ ఉందని సమాచారం మేరకు రెవెన్యూ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో 15 క్వింటాల బియ్యంను స్వాధీనం చేసుకున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	128, 138,148
చికెన్ విత్ స్కిన్	240.00
చికెన్ స్కిన్ లెస్	250.00

49,047 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 47,486 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 49,047 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 22,368 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	16500	334	8500	15000
నెంబరు. 5	9500	13500	నెంబరు. 5	12500	17500
273	10000	13000	273	--	--
341	10000	16000	341	9000	16000
4884	--	--	4884	11500	15000
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	18700	తేజ	10000	18500
బ్యాడిగి	8500	16000	బ్యాడిగి	9000	15900
దేవనూరు డీలక్స్	9000	14500	దేవనూరు డీలక్స్	11200	15500
తెల్లకాయలు	5000	12000	తెల్లకాయలు	5000	10000

పల్నాడు వార్తలు

అమ్మవు నీవే.. అఖిల జగాలకు..

రెంటచింతల, అక్టోబరు 8: మండలంలోని వివిధ ఆలయాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం రెంటచింతల వాసవీ ఆలయంలో ధనలక్ష్మీదేవి, జంక్షన్ కనకదుర్గ అమ్మవారు పార్వతిదేవీ, సత్రశాలలో మహాలక్ష్మిగా, రామాలయం, వేంకటేశ్వరస్వామి, చౌడేశ్వరీ, మంచికల్లు, రెంటాల, తుమృకోట, పాత, కొత్త పాలువాయి గ్రామాల్లోని ఆలయాల్లో దేవీ నవరాత్రులు కొనసాగుతున్నారు.



మహాలక్ష్మిగా సత్రశాల శ్రీగంగా భ్రమరాంబ అమ్మవారు

శ్రీమహాలక్ష్మిదేవిగా వీర్లంకాళమ్మ

కారంపూడి, అక్టోబరు 8: పట్టణంలో ఉన్న శ్రీవీర్లంకాళమ్మ దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధికసంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని పూజల్లో పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని పోలేరమ్మ గుడివీధిలో మహిళలు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.

మహాలక్ష్మి అలంకరణలో..

మాచర్ల రూరల్, అక్టోబరు 8: మండలంలోని విజయపురిసౌత్ మెయిన్ బజారులోని కనకదుర్గా అమ్మవారు మంగళవారం మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. ఆల య కమిటీ ఆధ్వర్యంలో రూ. 7,88,500 విలువైన కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు. సీ టైపులోని కనకదుర్గ అమ్మవారు మంగళగౌరిగా, ప్రభుత్వాస్పత్రి సమీపంలో ఏర్పాటు చేసిన మం డపంలో కనకదుర్గ అమ్మవారు శ్రీమహాలక్ష్మిగా దర్శనమిచ్చారు.



విజయపురిసౌత్ మెయిన్ బజార్‌లో మహాలక్ష్మిగా కనకదుర్గ అమ్మవారు

సత్రశాల ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకురావాలి

● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల, అక్టోబరు 8: పల్నాడులో ప్రముఖ శైవక్షేత్రంగా ఖ్యాతి గడించిన సత్రశాలలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జుస్వామి ఆలయ అభి వృద్ధికి దాతలు ముందుకు రావాలని అదే సమ యంలో తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. సత్రశాల ఆలయ ఈవోగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన గాదే రామిరెడ్డి మంగళవారం దేవాదాయ సిబ్బందితో కలిసి ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛాలను అందచేశారు. ఈ సం దర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్చి 8న మహా శివ రాత్రి సందర్భంగా ఆలయాన్ని సందర్శించి ప్ర త్యేక పూజలు చేశానని ఎమ్మెల్యేగా గెలిచిన తరు వాత ఆలయాన్ని వాస్తుపరంగా తీర్చిదిద్దుతానని మొక్కుకున్నానని తన కోరిక ఫలించడంతో దేవ దాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో ఆలయ పురోభివృద్ధి గురించి ఒకసారి చర్చించినట్లు చెప్పారు. పవిత్ర కృష్ణానది ఒడ్డున ఉండటంతో అన్ని హంగులతో పునర్నిర్మించడానికి పూర్తిస్థాయి లో అవకాశాలున్నాయని దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు.

బ్రాహ్మణులు దైవసమానులు

సమాజ హితం కోరే వారు బ్రాహ్మణులేనని వారు దైవంతో సమానంగా సమాజం భావిస్తుందని వారి అభ్యున్నతికి చంద్రబాబు ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అన్నారు. డీడీఎన్ఎస్ పథకం కింద అర్చకుల వేతనాలను కూటమి ప్రభుత్వం పెంచడంతో కృతజ్ఞతలు తెలియచేసేందుకు రాష్ట్ర అర్చక సేవాసంఘ నేతలు జి.కృష్ణమాచార్యులు, వి.రమణాచార్యులు నేతృత్వంలో పలువురు బ్రాహ్మణులు వెల్దుర్తిలోని ఎమ్మెల్యే స్వగృహంలో సన్మానించి ఆశీర్వచనాలు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డీడీఎన్ఎస్ పథకం కింద ఇప్పటి దాకా రూ.5 వేలు చెల్లించారని ఇప్పటి నుంచి రూ.10 వేలకు పెంచడం హర్షించదగ్గ విషయమన్నారు. 376 సర్వేనెంబర్ లోని ఎకరన్నర వేణుగోపాల స్వామికి చెందిన మాన్యంలో జాతీయ రహదారి నిర్మించారని కానీ ఆలయానికి భూమికి సంబంధించి ఎటువంటి పరిహారం చెల్లించలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా అధికారులతో మాట్లాడుతానని హామీనిచ్చారు.



ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డికి బొకే అందచేస్తున్న సత్రశాల ఆలయ ఈవో గాదే రామిరెడ్డి

మద్యం షాపుల కోసం 70 దరఖాస్తులు : ఎక్సైజ్ సీఐ

క్రోసూరు, అక్టోబరు 8: క్రోసూరు ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో మద్యం షాపుల కోసం ఇప్పటివరకు 70 దరఖాస్తులు అంది నట్టు ఎక్సైజ్ సీఐ టీ తులసీ మంగళవారం తెలియజేశారు. దరఖాస్తులు చేసుకోవటానికి 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉందన్నారు. స్టేషన్ పరిధిలోని మూడు మండలాల్లో మొత్తం 10 షాపులకు దరఖాస్తులు కోరినట్టు తెలిపారు. క్రోసూరు నాలుగు, అచ్చంపేట నాలుగు, బెల్లంకొండ రెండు షాపుల కోసం దరఖాస్తులు ఆహ్వానించామని తెలియజేశారు. గడువులోగా మరికొన్ని దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. 11వ తేదీన నరసరావుపేట ప్రకాష్ నగర్ టౌన్‌హాల్లో కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీలు తీస్తామని అన్నారు. దరఖాస్తుదారులు సిండికేట్ అవుతూ ఎక్కువ దరఖాస్తులు వేయటం లేదని వచ్చిన వార్తల గురించి వివరణ కోరగా అటువంటిదేమి లేదని, తమ పరిధిలో ముమ్మరంగా దరఖాస్తులు వస్తున్నాయని ఆమె తెలిపారు.

సీతారాముల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

మాచర్ల రూరల్, అక్టోబరు 8: మండలంలోని విజయపురిసౌత్‌లో ఉన్న సీతారామాలయంలో రాజగోపుర శిఖర కలశ ప్రతిష్ఠను పురస్కరించుకొని మంగళవారం సీతారాముల ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. కోలా సుబ్బారెడ్డి, నాగమ్మ కుటుంబసభ్యుల సహకారంతో రూ.కోటి వెచ్చించి రాజగోపుర శిఖర కలశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కలశ ప్రతిష్ఠను బుధవారం బ్రహ్మశ్రీ వట్టిపల్లి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి హాజరుకానున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కోలా వసంతకుమార్‌రెడ్డి, కార్యదర్శి రామాంజనేయులు, కోశాధికారి సత్యనారాయణ, సత్తిబాబు, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, రంగారావు, అమర్‌కుమార్, నరసింహమూర్తి, సీహెచ్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఊరేగింపులో శ్రీసీతారాముల ఉత్సవ విగ్రహాలు

మాచర్ల ఎంపీడీవోగా ఫణికుమార్‌నాయక్

మాచర్లటౌన్, అక్టోబరు 8: మాచర్ల ఎంపీడీవోగా ఆర్ ఫణికుమార్‌నాయక్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గురజాల నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. కాగా ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన ఎంపీడీవో సరోజినిదేవి రెంటచింతలకు బదిలీపై వెళ్లారు.



ఫణికుమార్‌నాయక్

నేటి నుంచి రిఫ్రెషర్ శిక్షణ

వెల్దుర్తి, అక్టోబరు 8: మండలంలోని గ్రామ పంచాయతీల ఉపసర్పంచులు, ప్రతి పంచాయతీ నుంచి ఇద్దరు వార్డు మెంబర్లకు బుధ, గురువారాల్లో వెల్దుర్తి మండల పరిషత్ కార్యాలయలో రిఫ్రెషర్ శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. అలాగే ఈనెల 3వ తేదీన గ్రామసభల్లో గుర్తించిన పనులకు సంబంధించి జాబితాను ఎంపీడీవో కార్యాలయంలో అందించాలన్నారు.

● నకరికల్లులో..

నకరికల్లు, అక్టోబరు 8: ఉప సర్పంచులకు ఈనెల 9, 10తేదీల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంపీడీవో గొల్లపల్లి కాశయ్య తెలిపారు. ఉపసర్పంచ్‌తో పాటుగా ఒక మహిళా వార్డు సభ్యురాలు, ఒక సభ్యుడు శిక్షణకు హాజరు కావాలన్నారు. శిక్షణకు హాజరయ్యే సభ్యులు ఆధార్‌కు లింకైన మొబైల్ ఆధార్ జిరాక్స్‌ను తీసుకురావాలన్నారు. గ్రామ పంచాయతీ విధులు, బాధ్యతలు, సొంత ఆదాయ వనరులు, పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరాలో గ్రామ పంచాయతీ పాత్ర వంటి వాటిపై శిక్షణ ఇస్తారన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం : డీఎస్పీ

సత్తెనపల్లి, అక్టోబరు 8: సత్తెనపల్లి సబ్‌డివిజన్ పరిధిలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రోత్సహించినా ఉపేక్షించేది లేదని డీఎస్పీ హనుమంతురావు హెచ్చరించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సబ్‌డివిజన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్ల పరిధిలో శాంతి భద్రతలను కాపాడేందుకు కృషి చేస్తామన్నారు. జనజీవనానికి ఆటంకాలు లేకుండా చూసేందుకు ఆయా స్టేషన్ల పోలీస్ అధికారులు, సిబ్బందిని అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. శాంతి భద్రతల పర్యవేక్షణే ధ్యేయమన్నారు. గంజాయి విక్రయించినా, తాగినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వీలైనంత వరకు మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సత్తెనపల్లి పట్టణంతో పాటు మండల కేంద్రాల్లో వ్యాపార దుకాణాల యజమానులందరూ సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. కెమెరాల ఏర్పాటు వల్ల ప్రజల ఆస్తులకు రక్షణతో పాటు నేరాల అదుపుకు దోహదపడతాయన్నారు. గతంలో నేరాలకు పాల్పడి వివిధ కేసుల్లో నిందితులుగా ముద్రపడిన వారిపై, రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. వారి కదలికలపై నిఘా ఉంచుతామన్నారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

పారిశుధ్య పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

నరసరావుపేట టౌన్, అక్టోబరు 8: నరసరావుపేట పారిశుధ్యంపై ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మంగళవారం పరిశీలించారు. పారిశుధ్యం మురికి కాలువల పనితీరును మెరుగుపరచాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మల్లమ్మసెంటర్, స్టేషన్‌రోడ్, సత్తెనపల్లి రోడ్, రావిపాడు నుంచి ప్రధాన రహదారులు వెంట జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. మురికి నీరు, చెత్త పేరుకుపోవడాన్ని చూసి అసహనం వ్యక్తం చేశారు. కాలినడకన పలు సచివాలయాలను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు, వారి విధులు, పనితీరును అడిగి తెలసుకున్నారు. సచివాలయాల సిబ్బందితో మాట్లాడుతూ రాజకీయాలను పక్కనపెట్టి పట్టణ అభివృద్ధికి ప్రజల కోరిక మేరకు అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. పట్టణ అభివృద్ధి తనవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. నరసరావుపేట పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అధికారులు ఇంకా వైసీపీ ప్రభుత్వంలో ఉన్నట్లే వ్యవహరిస్తున్నారని, ఇకపైన మాటలు ఉండవని, చర్యలు చేపడతామని హెచ్చరించారు.

డీఎస్సీశిక్షణకు సంస్థల ఆహ్వానం

నరసరావుపేట కల్చరల్, అక్టోబరు, 8: రాష్ట్ర సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు సంయుక్తంగా 5050మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో డీఎస్సీ శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించినట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా ఈ శిక్షణ రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికచేసిన శిక్షణ సంస్థల్లో సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు నిర్వహిస్తున్న స్టడీ సర్కిల్‌లో ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఆసక్తి గల సంస్థలు ఎంపానెల్ చేసేందుకు కావలసిన వివరాలతో కూడిన ఈవోఐ డాక్యుమెంట్‌ను ఏపీ ఈ-ప్రొక్యూర్‌మెంట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకునే సంస్థలు గడచిన రిక్రూట్‌మెంట్‌లలో కనీసం 100మంది ఉద్యోగాలు పొంది, 3 సంవత్సరాల సరాసరి టర్నోవర్ రూ.40లక్షలు కలిగి ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ ఈ నెల 21 అని తెలిపారు.

నేడు చిట్టి చిట్టి కమలాలు పుస్తకావిష్కరణ

నరసరావుపేట కల్చరల్, అక్టోబరు 8: నెల నెల సాహిత్య మేళా కార్యక్రమంలో భాగంగా శ్రీనాథ సాహితీ పరిషత్ ఆధ్వర్యంలో నేడు చిట్టి చిట్టి కమలాలు పుస్తకావిష్కరణ జరుగుతుందని పరిషత్ కార్యదర్శి స్వర్ణ రామిరెడ్డి మంగళవారం తెలిపారు. ఉదయం 10గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక శాసనసభ్యుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమం పల్నాడు రోడ్డులోని శాఖా గ్రంథాలయంలో జరుగుతుందని సాహిత్యాభిమానులు అందరూ పాల్గొనాలని కోరారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ఇర్లపాడు (శావల్యాపురం) అక్టోబరు 8: ఉపాధి హామీ నిధులతో మండలంలోని ఇర్లపాడులో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ వెనిగండ్ల రమాదేవి ఆంజనేయులు పాల్గొని భూమిపూజ చేసి సిమెంట్ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారు. సర్పంచ్ రమాదేవి మాట్లాడుతూ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సహాయ, సహకారాలతో ఉపాధిహామీ నిధులు రూ.10లక్షలతో గ్రామంలోని మెయిన్‌రోడ్డులో 199మీటర్ల పొడవు, 4మీటర్ల వెడల్పుతో సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఎన్నో ఏళ్ళుగా గ్రామంలోని మెయిన్‌రోడ్డులో వర్షపునీరు, మురికినీరు నిలబడి ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతుండడంతో విసయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళగా నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. సిమెంట్‌రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వరస్వామి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

కెనాల్‌లో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

శావల్యాపురం, అక్టోబరు 8: మండలంలోని గంటవారిపాలెం సమీపంలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్ వద్దకు సోమవారం సాయంత్రం ఈత కొట్టేందుకు వెళ్ళి నీటి ప్రవాహంలో గల్లంతైన వినుకొండ పట్టణానికి చెందిన కల్వకుంట సతీష్ బాబు (23) మృతదేహం మంగళవారం ఉదయం లభ్యమైనట్లు ఎస్‌ఐ లేళ్ళ లోకేశ్వరరావు తెలిపారు. ఎస్‌ఐ మాట్లాడుతూ కెనాల్‌లో గల్లంతైన సతీష్‌బాబు కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టగా అతడు నీటి ప్రవాహంలో కొంతదూరం కొట్టుకుపోయి అడవిపాలెం లాకుల వద్ద చనిపోయి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించి శవ పంచనామా నిర్వహించి వారి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.



ఆశాడే కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యాధికారులు రాధాకృష్ణన్, రమ్య

ఆశా వర్కర్లు లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి

● పీహెచ్‌సీ వైద్యాధికారి రాధాకృష్ణన్

శావల్యాపురం, అక్టోబరు 8: ఆశా వర్కర్లు ప్రభుత్వం అప్పగించిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలని, అలసత్వం వహిస్తే వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని పీహెచ్‌సీ వైద్యాధికారి మాన్యం రాధాకృష్ణన్ హెచ్చరించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఆశా వర్కర్ల పనితీరు, గర్భిణులు, బాలింతల నమోదు, వ్యాధి నిరోధక టీకాలు తదితర అంశాలను పరిశీలించారు. రాధాకృష్ణన్ మాట్లాడుతూ ఆశా వర్కర్లు గ్రామాల్లోని ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి వారికి ఉన్నతమైన సేవలందించాలని, గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రతిరోజూ ఇంటింటికీ తిరిగి పర్యవేక్షణ చేయాలని, సాధారణ కాన్పుల వలన కలిగే ప్రయోజనాలను మహిళలకు వివరించి పీహెచ్‌సీలో సాధారణ కాన్పుల సంఖ్యను పెంచాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి రమ్య, హెల్త్‌సూపర్‌వైజర్‌లు ఏడుకొండలు, ఉమాదేవి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎం, ఆశాలు పాల్గొన్నారు.

తెగుళ్ళ నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలి

● మండల ఇన్‌చార్జి వ్యవసాయశాఖాధికారి రామారావు

శావల్యాపురం, అక్టోబరు 8: వరి పంటను సాగుచేసిన రైతులు తెగుళ్ళ నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని, సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టి తెగుళ్ళు నివారించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని మండల ఇన్‌చార్జి వ్యవసాయశాఖాధికారి రామినేని రామారావు అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా శానంపూడి, ముంద్రువారిపాలెం గ్రామాల్లో రైతులు సాగుచేసిన వరి పంటను ఆయన మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం వరి పంటకు స్వల్పంగా ఆకుచుట్టు పురుగు వ్యాప్తి చెందుతుందని, దాని నివారణకు క్లోరిఫైడ్‌పాస్ మందును పిచికారీ చేయాలన్నారు. వాతావరణం చల్లగా ఉండడం వలన అగ్గితెగులు లక్షణాలు స్వల్పంగా కనిపిస్తున్నాయని, అగ్గితెగులు నివారణకు నత్రజని ఎరువులు తక్కువ వాడాలని, నత్రజని ఎరువుల వాడకం వలన మెత్తదనం తగ్గి అగ్గితెగులు వ్యాప్తి చెందే అవకాశముంటుందన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా వ్యవసాయశాఖ సిబ్బంది అందించే సలహాలు, సూచనలను రైతులంతా పాటించి మంచి దిగుబడులు సాధించాలన్నారు. ఏఈవో పూరేటి అశోక, వీఏఏ ఇర్మియా, ఏఎంసీ నాగేశ్వరరావు, గ్రామ నాయకులు మందలపు వెంకటనారాయణ, వెంకటేశ్వర్లు, అనంతమ్మ పాల్గొన్నారు.

లింగాకర్షక బుట్టలతో గులాబీ రంగు పురుగు నివారణ

నాదెండ్ల, అక్టోబరు 8: పత్తి పైరులో గులాబీరంగు పురుగు నివారణకు రైతులందరూ సామూహికంగా లింగాకర్షక బుట్టలను ఏర్పాటుచేసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివకుమారి అన్నారు. మండలంలోని కనపర్రు, అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు ఏడీఏ మస్తానమ్మ మాట్లాడుతూ భూసార పరీక్షలు, విత్తన శుద్ధి, వేప గింజల కషాయం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. పత్తి పొలాలను పరిశీలించిన అధికారులు రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఏ హరిప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకాలపై నిర్లక్ష్యం

● మరమ్మతులకు నోచుకోని ఏడు పథకాలు

● వైసీపీ ప్రభుత్వ హయాంలో అధ్వాన నిర్వహణ

● నిధులు లేక ప్రారంభానికి నోచుకోని 7 కొత్త పథకాలు

● పట్టించుకోని పాలకులు, అధికారులు

● చివరి భూములకు నీరందక రైతుల లబోదిబో



విద్యుత్ సౌకర్యం లేక నిరుపయోగంగా ఉన్న నీటి మోటార్లు



తిమ్మాయపాలెం పంచాయతీ పరిధిలో మూలనపడ్డ ఎత్తిపోతల పథకం, చాత్రగడ్డపాడు వద్ద గుండ్లకమ్మ నదిపై ఏర్పాటుచేసిన ఎత్తిపోతల

వినుకొండ టౌన్, అక్టోబరు 8: దేశానికి రైతే రాజని, రైతు లేనిదే రాజ్యం లేదని అనే నినాదాన్ని పాలకులు ప్రచారానికే వాడుకుంటున్నారు తప్ప, రైతును ఆదుకోవడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వినుకొండ నియోజకవర్గంలో ఎత్తి పోతల పథకాలపై ఆధారపడి పంటలు పండిస్తున్న రైతులకు నీరు అందకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఎత్తిపోతల పథకాల ద్వారా రైతులకు నీరు అందించి రైతులకు లాభసాటి వ్యవసాయం అందించాలన్న లక్ష్యంతో లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా కంభంపాడు, తెల్లబాడు, ఉప్పలపాడు కలిపి 2559 ఎకరాలు, ఉప్పలపాడు -2లో 20,707 ఎకరాలు, కొత్తపాలెం 870 ఎకరాలు, ములకలూరు 650 ఎకరాలు, పువ్వాడ, కొండలరాయునిపాలెం గ్రామాల్లో 3,178 ఎకరాలకు, ఐనవోలు 1150 ఎకరాలకు నీరందించాలనే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ హయాంలో ఎత్తిపోతల పథకాలను మంజూరు చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవస్థలన్నీ అస్తవ్యస్తంగామారి నిధులు లేని కారణంతో అవి కార్యరూపం దాల్చిన దాఖలాలు లేవు. ఇదిలా ఉండగా గతంలో నియోజకవర్గంలో గుండ్లకమ్మ నది, కొంకేరు వాగు, వల్లేరు వాగు, ఎన్‌ఎస్‌పీ కాలువలపై 26 లిఫ్ట్ ఇరిగేషన్లు నిర్మించారు. ములకలూరు -2, పిట్టంబండ, తంగిరాల, కొత్తజడ్డవారిపాలెం, పాత నాగిరెడ్డిపల్లి, గుండేపల్లి, శివాపురం ప్రాంతాల్లో ఎత్తిపోతల పథకాలు సోషల్ ఇంజనీర్ పరిధిలో పనిచేయాల్సి ఉంది. కొన్ని మరమ్మతులకు నోచుకోకపోవడంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి. తిమ్మాయపాలెం పంచాయతీ పరిధిలో 1994 సంవత్సరంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. దీనిద్వారా 100ఎకరాల ఆయకట్టుకు నీరందించాలనే లక్ష్యంతో నిర్మించినప్పటికీ విద్యుత్ సౌకర్యం లేక పథకం నిరుపయోగంగా మారింది. గతంలో 7 గంటల విద్యుత్ సరఫరా సమయంలో పథకం కొంతమేరకు పనిచేసినప్పటికీ చివరి భూములకు నీరు చేరకపోవడంతో 24 గంటలు విద్యుత్ సరఫరా చేయాలని అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా నేటికి అది కార్యరూపం దాల్చిన దాఖలాలు లేవు. విద్యుత్ సరఫరా లేకపోవడం. నిరుపయోగంగా ఉన్న విద్యుత్ మోటార్లు పనిచేయక పోవడంతో పథకం నిరుపయోగంగా మారింది. ఇదిలాఉండగా చాత్రగడ్డపాడు వద్ద ఏర్పాటుచేసిన పెరుమాలపల్లి మేజర్ ఎత్తిపోతల పథకంకు నిధులు కేటాయించి శిథిలావస్థకు చేరిన పైపులైన్‌తో పాటు, దొంగలు దోచుకున్న విద్యుత్ ట్రాన్సుఫార్మర్లు ఏర్పాటుచేసి, మోటార్లకు మరమ్మతులు చేపడితే వందలాది ఎకరాలకు నీరు అందించవచ్చని రైతులు కోరుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వర్షాలు సమృద్ధిగా కురవడం, వాగులు, బావులు, సాగర్ కాలవలు, గుండ్లకమ్మ నదీ పరివాహక ప్రాంతంలో నీరు ప్రవహించినప్పటికీ, పథకాలు పనిచేయకపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం హయాంలోనైనా ఎత్తిపోతల పథకాలను పునఃనిర్మించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ పథకాల నిర్వహణపై ఏపీఎస్ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులను వివరణ కోరేందుకు యత్నించినా ఎవరూ అందుబాటులోకి రాలేదు.

అమ్మవారికి విశేష పూజలు



శృంగేరి శంకరమఠంలో గజలక్ష్మీ అలంకారంలో శ్రీశారదాంబ



కొచ్చెర్లలో కరెన్సీ నోట్ల అలంకరణలో పార్వతీదేవి

నరసరావుపేట, అక్టోబరు 8: జిల్లాలోని పలు దేవాలయాల్లో దసరా ఉత్సవాలు కన్నుల పండుగగా జరుగుతున్నాయి. భక్తులు వేలాదిగా ఆలయాలకు వచ్చి పూజలుచేశారు. ప్రధాన రహదారుల్లోని, గడియార స్తంభం సెంటర్లలో మహాలక్ష్మమ్మ చెట్లవద్ద దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

● రొంపిచర్ల: రొంపిచర్లలోని వాసవి అమ్మవారు ధనలక్ష్మిగా, విప్పర్లలోని కామాక్షి అమ్మవారు శ్రీమహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. రొంపిచర్ల వాసవి అమ్మవారి ఆలయంలో జరిగిన రుద్రాభిషేక పూజల్లో పలువురు దంపతులు పాల్గొన్నారు.

● శావల్యాపురం: మండలంలోని కారుమంచి, మతుకుమల్లి, బొందిలిపాలెం, శావల్యాపురం, పొట్లూరు, వేల్పూరు తదితర గ్రామాల్లో దసరా నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. శావల్యాపురం రైల్వేస్టేషన్ మార్గంలోని నీలంపాటి అమ్మవారి దేవాలయంలో కనకదుర్గమ్మ విగ్రహం వద్ద చైర్మన్ మద్దినేని హరిబాబు, పొట్లూరు పంచాయతీ పరిధిలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్ వద్ద లక్ష్మీ తిరుపతమ్మతల్లి, మావిరాల ఎల్లమ్మతల్లి దేవాలయం వద్ద ధర్మకర్త గోనుగుంట్ల వెంకట్రావు పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

● బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు, పేరూరుపాడు, వడ్డెంగుంట, నాయుడుపాలెం, బొల్లాపల్లి గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వెల్లటూరులో శ్రీరుక్మిణీ సత్యభామ, సోమేశ్వరాలయం, పేరూరుపాడు వెంకటేశ్వర స్వామి దేవాలయం, వడ్డెంగుంట శ్రీ మంజునాదేశ్వర దేవాలయం, నాయుడుపాలెం, కోదండ రామ దేవాలయం, బొల్లాపల్లి రామాలయం తదితర దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

● ఈపూరు: శరన్నవరాత్రులను పురస్కరించుకొని మంగళవారం కొచ్చెర్ల పార్వతీదేవి అమ్మవారికి రూ.లక్ష కరెన్సీతో అలంకరించారు.

● నూజెండ్ల: చెన్నకేశవస్వామి దేవాలయంలో 6వ రోజు పీ విజయలక్ష్మీదేవిగా, రవ్వవరం శ్రీ వెంకటేశ్వర జగన్మాత పీఠంలో అన్నపూర్ణాదేవిగా భక్తుల నుంచి పూజలందుకున్నారు. అదేవిధంగా ఐనవోలులో బతుకమ్మ వేడుకల్లో మహిళలు విశేషంగా పాల్గొన్నారు. కోలాటం, భజనలు నిర్వహించారు.

ప్రయోగ ఫలితాలు సామాన్యులకు తెలియాలి

● ఇస్రో సీనియర్ శాస్త్రవేత్త శ్రీనివాసరెడ్డి




టి.శ్రీనివాసరెడ్డి, ఇస్రో సీనియర్ సైంటిస్ట్

నరసరావుపేట కల్చరల్, అక్టోబర్ 8: ఇస్రో ప్రయోగ ఫలితాలు సామాన్యులకు తెలిసేలా చేయడమే అంతరిక్ష వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని ఇస్రో సీనియర్ శాస్త్రవేత్త టి.శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ నెల 7 నుంచి 9 వరకు ఇస్రో చేపట్టిన ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలకు నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల వేదికైంది. ఇందులో భాగంగా అంతరిక్ష నమూనాలతో ప్రదర్శనను ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనను తిలకించడానికి పాఠశాల, కళాశాలల విద్యార్థులు తరలి వస్తున్నారు. రాకెట్ మోటార్స్, శాటిలైట్ నమూనాలు, వీటికి సంబంధించిన వివరాల డిస్‌ప్లే పానల్స్‌తో ప్రదర్శనశాల ఆసక్తిదాయకంగా ఉంది. ఈ నేపథ్యంలో వారోత్సవాలపై శాస్త్రవేత్తలు, విద్యార్థులు తమ అభిప్రాయాలను తెలియజేశారు. ఇస్రో ప్రయోగ ఫలితాలు సామాన్యులకు తెలియజేసేలా చేయడమే ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశం అని శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రయోగ ఫలితాలు నిత్య జీవితంలో ఎలా ఉపయోగపడుతున్నాయో అందరికీ తెలియాలన్నారు. రాష్ట్రంలో కడప, నెల్లూరు, తిరుపతి, నరసరావుపేట, భీమవరంలలో వారోత్సవాలను ఇస్రో నిర్వహిస్తోందన్నారు. వారోత్సవాలతో స్పేస్ గురించి, రాకెట్, శాటిలైట్, లాంచింగ్ పాడ్ వంటి వాటి గురించి పూర్తి అవగాహన కలిగిందని బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థి కె.అమృత తెలిపారు. ఈ స్పేస్ వీక్‌లో పాల్గొంటే, నాకు స్పేస్‌లో ఉన్నట్లే ఉందని ఫైనల్ ఇయర్ విద్యార్థి జీషిత తెలిపారు. కార్యక్రమం వలన ఇస్రో చేస్తున్న ప్రయోగాలు, రాకెట్, శాటిలైట్ వీటి గురించి సంపూర్ణంగా తెలిసిందన్నారు. నిత్య జీవితంలో మనం ఉపయోగిస్తున్న ఇంటర్‌నెట్, సెల్‌ఫోన్, టీవీ, కంప్యూటర్ వీటన్నింటి వెనుక ఉన్న ఇస్రో సేవలు అద్భుతం అని నాలుగో సంవత్సర విద్యార్థి ఎ.శంతన్‌కుమార్ అన్నారు. ఈ వారోత్సవాల ద్వారా అంతరిక్షానికి సంబంధించి, ఇస్రో చేస్తున్న మంగళయాన్, చంద్రయాన్ వంటి ప్రయోగాల గురించి పూర్తి అవగాహన అయ్యిందన్నారు.

తెగుళ్ళపై అప్రమత్తంగా ఉండాలి: వ్యవసాయాధికారులు

ఈపూరు, అక్టోబరు 8: ప్రస్తుతం వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా వరిపైరుకు అగ్గితెగులు సోకే ప్రమాదముందని ముందు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ విస్తరణాధికారి అప్పారావు అన్నారు. మండలంలోని ఉప్పరపాలెం, కొచ్చెర్ల గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెగుళ్ళ బారినుంచి పంటలను రక్షించుకోవడంపై రైతులకు సూచనలు చేశారు.



కారుమంచిలో ర్యాలీని నిర్వహిస్తున్న ప్రణీత్‌వర్మ

అటవీజాతి మొక్కలతో అదనపు ఆదాయం

● టీవోఎఫ్ఐ పోగ్రాం స్టేట్ అసోసియేట్ ప్రణీత్‌వర్మ

కారుమంచి (శావల్యాపురం) అక్టోబరు 8: వ్యవసాయ భూమిలో అటవీ జాతి మొక్కలు, ఉద్యానవన మొక్కలు నాటడం ద్వారా అధిక దిగుబడులను సాధించి రైతులంతా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని టీవోఎఫ్ఐ పోగ్రాం స్టేట్ అసోషియేట్ ప్రణీత్‌వర్మ అన్నారు. మండలంలోని కారుమంచిలోని రైతులకు అటవీయేతర ప్రాంతాల్లో మొక్కల పెంపకం వల్ల ఉపయోగాల గురించి మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రణీత్‌వర్మ మాట్లాడుతూ ఉద్యానవన పంటలు, అటవీజాతి మొక్కల పెంపకానికి ప్రభుత్వం మంచి రాయితీలను అందిస్తోందని, వాటిసాగుపై రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సూచనలు, సలహాలను అందిస్తుందన్నారు. కాబట్టి ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకొని రైతులంతా ఉద్యానవన పంటల పెంపకాన్ని చేపట్టి ఆర్థికాభివృద్ధిని సాధించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ మల్లాపరపు గాలెయ్య, గ్రామ టీడీపీ అధ్యక్షుడు ముప్పా గిరిప్రసాద్, టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు యరమాసు కోటేశ్వరరావు, వినుకొండ నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షుడు గోపాళం శివప్రసాద్, ఎంపీటీసీ యూనిట్ ఇన్‌చార్జి కోటా హరిబాబు, వీహెచ్‌ఏ జంపాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లాప్ మిత్రలకు వేతనాలు చెల్లించాలి

● జిల్లా పంచాయతీ అధికారి విజయభాస్కరరెడ్డి

వినుకొండ, అక్టోబరు 8: గ్రామ పంచాయతీల్లో డంపింగ్ యార్డులను ఏర్పాటుచేసి, క్లాప్ మిత్రాలకు ప్రతి నెల క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించాలని పంచాయతీ కార్యదర్శులను జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) విజయభాస్కరరెడ్డి ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం నియోజకవర్గ కార్యదర్శులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో ఉన్న ఆదాయ వనరులపై కార్యదర్శులు అవగాహన కలిగి ఉండాలన్నారు. 15వ ఫైనాన్సు నిధులు సక్రమంగా వినియోగించాలని తెలిపారు. గ్రామాల్లోని డంపింగ్ యార్డులు మార్చి-25 నాటికి అమల్లోకి వచ్చేలా చూడాలన్నారు. తిమ్మాయిపాలెంలో ప్రజలు పారిశుధ్యంపై ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో, రెండు రోజుల్లో గ్రామంలో పారిశుధ్యం పనులు చేపట్టకపోతే షోకాజ్ నోటీస్ ఇవ్వాలని వినుకొండ ఈవోపీఆర్‌డీ సుందర్‌రెడ్డిని ఆదేశించారు. కార్యక్రమంలో శావల్యాపురం ఈవోపీఆర్‌డీలు సుందర్‌రెడ్డి, సుగుణమ్మ, ఎంపీడీవో జానీ బాషా తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో వార్డు మెంబర్ల పాత్ర కీలకం

● ఎంపీపీ మేడం జయరామిరెడ్డి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ మేడం జయ రామిరెడ్డి

నూజెండ్ల, అక్టోబరు 8: గ్రామాభివృద్ధిలో వార్డు మెంబర్ల పాత్ర ముఖ్యమైనదని ఎంపీపీ మేడం జయరామిరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతున్న ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్ల మొదటి బ్యాంచ్ శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వీధి లైట్లు, తాగునీరు, భవన నిర్మాణాలకు అనుమతులు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై వార్డు మెంబర్లు అవగాన కలిగి ఉండి పంచాయతీ సమావేశాల్లో తప్పకుండా పాల్గొని గ్రామాభివృద్ధికి అవసరమైన మంచి నిర్ణయాలు తీసుకోవటంలో బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో పీ ఉమాదేవి, పంచాయతీ కార్యదర్శులు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.



సింగర చెరువులో నీరు తాగుతున్న మేకలు, గొర్రెలు

రక్షిత తాగునీటికి రక్షణ కరువు

● మూగజీవాలతో కలుషితం అవుతున్న చెరువు నీరు

వినుకొండ టౌన్, అక్టోబరు 8: గత ప్రభుత్వం హయాంలో లక్షలు ఖర్చుచేసి సింగర చెరువుకు కట్టలు నిర్మించినప్పటికీ, మూగజీవాల తాకిడికి చెరువు నీటికి రక్షణ కరువైందని విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ పాలనలో మున్సిపల్ నిధులన్నీ, చెరువు మట్టికట్టలకు, కొండ చుట్టూ సీసీ రోడ్లుకు ఖర్చు చేయడంతో చేసిన అప్పులు తీర్చలేని పరిస్థితి. ఇప్పటికైనా పన్నుల ద్వారా వచ్చే నిధులతోనైనా ఉప్పరపాలెం వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న చెరువు కట్టకు ఫెన్సింగ్ నిర్మిస్తే కొంతమేరకు చెరువు నీటికి రక్షణ కల్పించవచ్చని ఆప్రాంతవాసులు వాపోతున్నారు. ఫెన్సింగ్ లేని కారణంగా పశువులు, గొర్రెలు, ఆవులు నిత్యం చెరువు నీటి కోసం వచ్చి నీటిని కలుషితం చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే సీజనల్ వ్యాధులతో ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు, చెరువు నీరు తాగాలంటే వెనుకడుగు వేయాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చెరువు నీటిపై శ్రద్ధచూపి, స్వచ్ఛమైన తాగునీటిని ప్రజలకు సరఫరా చేసి, అంటువ్యాధుల నుంచి ప్రజలను కాపాడాలని పట్టణ వాసులు కోరుతున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్ర బోస్ వివరణ కోరేందుకు యత్నించగా అందుబాటులో లేరు.

ప్రతి బాధితుడికి న్యాయం జరగాలి

● ఐసీఐసీఐ బ్యాంకు కుంభకోణంపై ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, సెప్టెంబరు 8: సంచలనంగా మారిన ఐసీఐసీఐ బ్యాంక్ కుంభకోణంలో నష్టపోయిన ప్రతిఒక్క బాధితుడికి న్యాయం జరగాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు డిమాండ్ చేశారు. మంగళవారం తన నివాసంలో ప్రత్తిపాటి విలేకరులతో మాట్లాడుతూ మాజీ మేనేజర్ గోల్డ్ అప్రైజర్ కలసి కోట్లాది రూపాయలు మోసం చేస్తుంటే బ్యాంక్ యాజమాన్యం కళ్ళు మూసుకుందా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదట చిలకలూరిపేట అనుకుంటే నరసరావుపేటలోను ఇదేతరహా మోసం వెలుగు చూడటం, ఇదే మేనేజర్ విజయవాడలోను పనిచేయటంతో అక్కడ ఇంకా ఏం చేసి ఉంటారనే అనుమానాలు కలుగుతున్నాయన్నారు. ఇంటి దొంగలే కోట్లు కొల్లగొట్టిన ఈ కేసులో సీబీఐ విచారణ జరిపించాల్సిన అవసరం ఉందన్నారు. బ్యాంక్‌లో మాయమైన బంగారం, ఫిక్సడ్ డిపాజిట్లకు సంబంధించి ప్రతిపైసా ఖాతాదారులకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందుకు నిర్దిష్టమైన హామీ ఇవ్వటంతో పాటు నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్నారు. అసలు ఇంత పెద్ద మొత్తంలో మోసం జరిగే వరకు బ్యాంక్ ఉన్నతాధికారులు పసిగట్టకుండా ఉండటంపై ఉన్నతాధికారుల సహకారంపై పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. డిపాజిట్లు, రుణాలకు సంబంధించి రసీదులపై ఏమైనా అనుమానాలు ఉంటే ఆయా తేదీల సీసీ పుటేజ్‌లను పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలి తప్ప నష్టపోయిన వారిని మరింత ఇబ్బంది పెట్టవద్దని ప్రత్తిపాటి విజ్ఞప్తి చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో బాధ్యులైన అధికారులపై తక్షణం క్రిమినల్ కేసులు నమోదుచేసి అరెస్టు చేయాలని, మరొకసారి ఇలాంటి వాటికి ఆస్కారం లేకుండా సరిదిద్దుకోవాలని డిమాండ్ చేశారు.

గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి: ఎంపీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ తలతోటి రాణి

నాదెండ్ల, అక్టోబరు 8: పంచాయతీల ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎంపీపీ తలతోటి రాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యుల శిక్షణ తరగతుల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో ప్రజల నుంచి వసూలు చేసే ఇంటి పన్ను, సంక్షేమ కార్యక్రమాలు పలు విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎంపీడీవో స్వరూపరాణి మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే అభివృద్ధి, పారిశుధ్యం మెరుగుదల తదితర విషయాలపై సూచనలు ఇవ్వటంతో పాటు పర్యవేక్షించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ లక్ష్మీకుమారి, ఏపీవో పుష్పరాజ్ పాల్గొన్నారు.

పురుగు మందుల మాఫియాను అరికట్టాలి

● ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, అక్టోబరు 8: ఎరువులు, పురుగుమందులు నకిలీలు, కల్తీ బ్లాక్ మార్కెట్ మాఫియాను అరికట్టాలని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అధికారులను ఆదేశించినట్లు మంగళవారం ఒక ప్రకటణలో తెలిపారు. రైతులకు నష్టం చేకూరే ఏపని ఈ ప్రభుత్వం సహించదన్నారు. నకిలీలు, కల్తీల విక్రయదారులపై చట్టపరమైన చర్యలతో పాటు, లైసెన్స్‌ల రద్దుచేసి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. అధికారులు ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గాల్సిన అవసరం లేదన్నారు. నకిలీలను అరికట్టాలని పల్నాడు జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో కోరామన్నారు. ఎరువులకు సంబంధించిన నిలవలపై తనిఖీలుచేసి మార్కెట్‌లో కొరత లేకుండా చూడాలన్నారు. ఎరువులు అక్రమ నిల్వలు, నకిలీ ఎరువులు, అనుమతులులేని బయో ఉత్పత్తులు ఉనికి ఎక్కడ కనిపించినా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఐటీఐ కాలేజీలో మెగా జాబ్ మేళా

వినుకొండ టౌన్, అక్టోబరు 8: మండలంలోని విఠరాజుపల్లి గ్రామ సమీపంలోని శ్రీబాలాజీ ఐటీఐ కళాశాల్లో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్ మేళాలో పలు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని, మొత్తం 200 నిరుద్యోగులు హాజరు కాగా, 150మంది ఉద్యోగాలకు ఎంపికైయ్యారు. ఎంపికైన ఐటీఐ విద్యార్థులకు నియామకపత్రం అందిచేసినట్లు ప్రిన్సిపాల్ కర్రి వెంకట్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీఐ కోర్సు చేసినవారికి మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, ప్రతి విద్యార్థి వినియోగించుకుంటే జీవితంలో స్థిరపడవచ్చని తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ జానకి, వైస్ ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రేపు కూటమి పార్టీల విస్తృతస్థాయి సమావేశం

చిలకలూరిపేట, అక్టోబరు 8: పట్టణంలోని ప్రత్తిపాటి గార్డెన్స్‌లో గురువారం సాయంత్రం 3గంటలకు మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు అధ్యక్షతన నియోజకవర్గ కూటమి పార్టీల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, కృష్ణ, గుంటూరు పట్టభద్రుల శాసనమండలి కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. పట్టభద్రుల ఓటరు నమోదు అంశాలతో పాటు పలు విషయాలను సమావేశంలో చర్చిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలలో ఉన్న పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

జాబ్‌మేళాలో 32మంది ఎంపిక

నరసరావుపేట కల్చరల్, అక్టోబరు 8: స్థానిక లింగంగుంట్లలోని నాక్ ట్రైనింగ్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 32మంది వివిధ కంపెనీలలో ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు తెలిపారు. జాబ్‌మేళాలో ఐదు కంపెనీలు పాల్గొన్నట్లు ఆయన చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తున్న ట్లు ఆయన తెలిపారు. కాగా ఈ జాబ్‌మేళాలో అదనపు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.సిహెచ్. రామాంజనేయులు, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి యం.రవీంద్రనాయక్, నరసరావుపేట స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ యం.వీరాంజనేయులు, జె.సురేష్, ఎ.రమ్య. వై.పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.